# నిష్ఫలమైన ఆదర్శం



కృష్ణ

రచన: భూపతి సుబ్రహ్మణ్యం

"ఇదెక్కడి చోద్యంరా బాబూ పెళ్ళి చూపులకొచ్చి ఆ అమ్మాయితో మాట్లాడితేగాని నిర్ణయించనంటావేమిట్రా! మీ అమ్మాయితో మా అబ్బాయి ముందుగా మాట్లాడితేగాని లాభంలేదని వాళ్ళతో ఎలా చెప్పగలం. అదేం మర్యాదగా ఉంటుందా?" నోరు నొక్కుకుంటూ అని సుందరమ్మ కొడుకు వేంకటాచలం కేసి విచిత్రంగా చూసింది.

"లేదమ్మా. ఆ అమ్మాయి అభిప్రాయం నేను స్వయంగా అడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను" వేంకటాచలం పట్టుదలగా అన్నాడు. వేంకట తను అనుకున్న విషయం జరిగితీరాలనే పట్టుదలగలవాడు. సుందరమ్మకు తెలుసు కొడుకెలాటి తత్వం గలవాడో. చలం పట్టుదల ఫలితంగా సూర్యనారాయణగారి రెండవకుమార్తె శారదతో చలం పెళ్ళిచూపుల ఇంటర్వ్యూ ఏర్పాటు చేయబడింది

* * *

"చూడండి నా ఉద్దేశ్యంలో ఇలాగ

పెళ్ళికుమార్తెను పెళ్ళికొడుకు స్వయంగా అభిప్రాయమడిగి తెలుసుకోవడం కాబోవ దాంపత్య జీవితానికి ఎంతో మంచిది. అందుకే నేను మిమ్మల్ని ఇలా ఇరుకులో పెట్టవలసివచ్చింది. శ్రమ ఇచ్చినందుకు ఏమీ అనుకోకండి. మీరు నాకు పూర్తిగా నచ్చారు. మరి నేను మీకు నచ్చానో లేదో తెలుసుకోకుండా కేవలం మీతల్లిదండ్రుల అభిప్రాయం మీద ఆధారపడి నేను మిమ్మల్ని పెళ్ళాడదలచుకోలేదు. మీ మనసులో ఉన్న నిజమైన అభిప్రాయం చెప్పండి నేను మీకు నచ్చానా ?" చలం ఆమెవంక చూస్తూ అడిగేడు శారద సిగ్గుతో తలవంచుకుంది. "చెప్పండి పరవాలేదు నేనంటే సంపూర్తిగా ఇష్టపడిన అమ్మాయినే నేను చేసుకోవాలనుకుంటున్నాను." చలం బలవంతపరిచాడు. శారద సిగ్గుతో "మా తల్లిదండ్రుల ఇష్టం" అంది. "మీతల్లిదండ్రులకు యిష్టమా లేదా అని నేనుఅడగడం నాక్కావలసింది మీ అంగీకారం ... మీ" చలం ఆమె కళ్ళల్లో ఏదో వెతుకుతూ అడిగేడు శారద సిగ్గుతో మాట్లాడలేకపోయింది "ఆడపిల్ల అంతకన్నా స్పష్టంగా చెప్పదురా. నీప్రశ్నలింక చాలించు. నీఎదురుగానిలిచి మాట్లాడడానికే పాపం సిగ్గుపడుతోంది. నువ్వేమో యక్షప్రశ్నలు వేస్తున్నావు." కొడుకును మందలిస్తూ సుందరమ్మ అతన్ని గదిలోనుండి అవతలకు తీసుకు వెళ్ళింది సూర్యనారాయణగారు మిగతా విషయాలు కదిపేరు. కొంత సంభాషణ జరిగేక చలం మధ్య కలుగజేసుకొని సూర్యనారాయణగారితో అన్నాడు "కట్నాలూ కానుకలూ గురించి మీరు బాదరబందీపడటం నాకిష్టంలేదండీ. నాకు కట్నం తీసుకోవడం ఇష్టంలేదు. ఇక పోతే పెళ్ళికూడా ఎంత నిరాడంబరంగా జరిపితే అంత బాగుంటుంది"

సూర్యనారాయణగారు ఆశ్చర్యపోయాడు. ఇదేంకాలం! తనేమీ కలగనటంలేదు గదా. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారాయన. పెద్దకొడుకు ప్రక్కగదిలో బట్టలేసుకుంటున్నాడు సూర్యనారాయణగారు గబగబా ఆగదిలోకి వెళ్ళారు. రంగారావు చొక్కా సర్దుకుంటూ అడిగేడు అసలుసంగతేమిటని. "అబ్బాయి నయాపైసాకట్నం లేకుండా పెళ్ళాడుతానంటున్నాడు. ఎంత మంచివాడు కాకపోతే అలా అంటాడు చెప్పు. ఏమంటావ్ ఎలా వుంది ఈ సంబంధం ?" సూర్యనారాయణగారు కొడుకువంక చూశారు అభిప్రాయం కోసం. "బాగుంది నాన్నగారూ" రంగారావు తన అభిప్రాయం చెప్పాడు. "నువ్వోసారి ఆ అబ్బాయితో మాట్లాడరాదూ" సూర్యనారాయణగారు కొడుకుతో అన్నారు రంగారావు అలాగే నంటూ చలంతో మాట్లాడడానికి వెళ్లాడు.

* * *



ఇక్కడ వేంకటాచలం గురించి కొంత చెప్పాలి. చలం బి. ఇ. మెకానికల్ చదివాడు. టాటానగర్ స్టీలు ఫాక్టరీలో పని చేస్తున్నాడు. తండ్రి, చలం సగం చదువు సాగుతూండగానే గతించాడు. చలానికి ఒకతమ్ముడు, ఒక చెల్లాయి కూడా ఉన్నారు. తమ్ముడు బి. యస్సీ చదువుతున్నాడు, చెల్లాయి పి. యు. సి. పాసయి పెళ్ళికి సిద్ధంగా ఉంది. ముందు నుండీ చలానికి ఏవేవో ఆదర్శాలు ఉండేవి. అవన్నీకూడా నిజజీవితంలో ఆచరణలో పెట్టాలని ఆతనికి తలంపు లుండేవి. అతనికుండే ఆదర్శాలపుట్టలో కానీ కట్నంలేకుండా పెళ్ళిచేసుకోవటం ఒకటి. అమ్మాయి తనంటే ఇష్టపడాలి. కేవలం తలిదండ్రుల బలవంతంమీదనో లేక తలిదండ్రులకు భారం వదిలిపోవాలనో తనను పెళ్ళాడడానికి సిద్ధపడకూడదు. ఇవీ చలం కోరికలు. ఇక పెళ్ళికూడా నిరాడంబరంగా చేసుకోవాలని అతని ఉద్దేశ్యం. సుందరమ్మకు కొడుకు ఆదర్శాలగొడవ పట్టకపోయినా, అతని పట్టుదల ఎలాటిదో తెలుసుగనుక, అతనితో వాదించటం మానేసింది.

శారద చాలా అందమైన అమ్మాయి. పెద్దగా చదువుకోలేదు. చక్కగా పాడుతుంది, వీణవాయిస్తుంది. శారదకు పెద్ద చదువేమీ లేకపోయినా చలం లెఖ్ఖ చేయలేదు. ఆమెను వివాహమాడడానికి మనస్ఫూర్తిగా అంగీకరించాడు.

* * *

"మీరు కట్నం తీసుకోననడానికి కారణం" రంగారావు వేసిన ప్రశ్నవిని అతనివైపు వింతగాచూశాడు చలం.

"అది నా అభిమతానికి విరుద్ధం గనుక" చలం చెప్పాడు. "మేము కట్నమిచ్చుకునే పరిస్థితిలోనే ఉన్నాంకదా. మాదగ్గర మీరు ఎందుకు తీసుకోకూడదూ?" రంగారావు మళ్ళీ అడిగాడు. "కట్నాలూ కానుకలూ తీసుకువచ్చే అమ్మాయి గుణగణాలతో రాదని నానమ్మకం. అదిగాక అహంకారంకూడా అలాటి అమ్మాయికి పెరుగుతుంది భర్తమీద ఎనలేని గౌరవం ఆపేక్ష ఉండాలంటే ఆమెను, భర్త, అనురాగం చూపించటం ద్వారానూ, హృదయవైశాల్యం చూపటంద్వారాను గెలుచుకోవాలి. అదిగాక ఆడపిల్ల గలవారిని కట్నాలనీ, లాంఛనాలనీ పీడించి డబ్బు వసూలుచేయడంకన్న వేరే దురన్యాయంలేదని నాఅభిప్రాయం. నాచిన్న ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని నేను అనుకుంటున్నాను. అందువల్లనే మీకు కట్నమిచ్చే తాహతు ఉన్నా కూడా నేను తీసుకోవడానికి అంగీకరించడంలేదు. ఏది ఏమైనా మీకు కావలసినది మీచెల్లెలు పెళ్ళి జరగడం. నాక్కావలసింది నా ఆదర్శం ఆచరించడం. అంతే" చలం తేల్చిచెప్పాడు.

"చాల సంతోషం. అందరు యువకులూ మీమార్గాన్నే అనుసరించినట్లయితే కొన్ని సాంఘిక సమస్యలు సులభంగా పరిష్కరింప బడతాయి. మాకు మీసంబంధం దొరకటం నిజంగా మా అదృష్టం. తొందరలోనే ముహూర్తం పెట్టే ఏర్పాటు చేయిస్తాం" రంగారావు సంతోషంగా అన్నాడు.

పెళ్ళి చూపులకు హైదరాబాద్ వచ్చిన చలం తాతానగర్ వెళ్ళిపోయాడు. సుందరమ్మ విశాఖపట్నం వెళ్ళిపోయింది

* * *

పెళ్ళి చూపులవరకూ సవ్యంగానే జరిగింది. తరువాత కథ అడ్డంతిరిగింది. శారదతల్లి రంగనాయకమ్మగారికి పెద్ద అనుమానం వచ్చిపడింది. అబ్బాయి బాగానేఉన్నాడు. మంచి ఉద్యోగంకూడా ఉంది కట్నం కోరటంలేదు. కానీ అతని గుణంఎలాటిదో? ఏలోటుపాట్లూ లేక పోతే, వేలకువేలూకట్నాలక్రిందగుంజుకు పోతూన్న ఈకాలంలో, కానీ కట్నం తీసుకోకుండా ఎందుకు చేసుకుంటున్నాడు. నిశ్చయంగా అతనికేదో లోటుంది. అదేమై ఉంటుందో? ఇదీ రంగనాయకమ్మగారికి వచ్చిన అనుమానం ఆ విషయమే కొడుకుతో కదిపిందావిడ. "ఒరేయ్ రంగా! అంతా బాగుందిగానీ, ఈఅబ్బాయి కానీ కట్నంలేకుండా చేసుకుంటాననడంలోని అంతర్యమేమిటంటావ్ ఏదో లోటుండబట్టేకదూ." రంగారావుకి విషయం తట్టలేదు. తల్లి ఇలాఅనేసరికి ఆ అనుమానబీజం రంగారావులోనూ నాటుకుంది. "అవునమ్మా. కావచ్చు. ఆరోజున కట్నం తీసుకోక పోవడం నా ఆదర్శమంటూ చెప్పాడు.




ఈ రోజుల్లో ఇంత ఉన్నత భావాలు ఎవరికున్నాయ్ కనుక. పెళ్ళికూడా పెద్ద ఆడంబరంగా చేయవద్దన్నాడు. ఆడంబరంగాచేస్తే నలుగురికీ తెలుస్తుందనేగా! అంటే ఇతనికి తనపెళ్ళి జరుగుతున్నట్లు తెలియకూడనివేరొకవ్యక్తితోఏమైనా" రంగారావు ఆగేడు. "అవునుగాబోలురా అందుకే ఇలాటిఎత్తు వేశాడు. ఇంకా నయం. నాబంగారుతల్లి గొంతుకోసి ఉండేవారం. హాయిగా కట్నంఎంతయినా సరే ధారపోసి మంచి సంబంధం చూసి చేద్దాం. కట్నంలేదుకదా అని ఆశపడి ఈసంబంధం ఖాయంచేస్తే లాభంలేదురా నాయనా" రంగనాయకమ్మ దీర్ఘం తీసింది. తండ్రితోకూడా చెప్పాడు ఈ సంగతి రంగారావు. సూర్యనారాయణగారి కీసంబంధం వదులుకోవటం ఎందువల్లో ఇష్టంలేకపోయింది. "పోవే. నువ్వూ నీ అనుమానాలూనూ. బంగారంవంటి కుర్రాడు. అతనికి వంక పెడతావేమిటి" సూర్యనారాయణగారు కసురుకున్నారు భార్యను. రంగనాయకమ్మకు అనుమానం ప్రబలిందిగాని తగ్గలేదు. వేలకువేలు కుమ్మరిస్తేగాని ఆడపిల్లలు అత్తవారిళ్ళకి పోవడంలేదు. లాంఛనాల దగ్గరనుండి తాంబూలం ఇచ్చే వరకు దండించి పుచ్చుకొంటున్నారు మగపెళ్ళివారు. మొన్న సమ్మగారి కూతురి పెళ్ళిజరిగిన ఆశపడుచు కట్నం ఏదో సమం. అందలేదని మగ పెళ్ళివారు పేచీ పెట్టారట. పీటలమీదనుండి పెళ్ళికొడుకుని లేపినంతవరకూ వచ్చిందటకూడా. ఇలా అన్ని మూలలనుండి వరకట్న పిశాచం తాండవ నాట్యంచేస్తున్న కాలంలో ఏదో ఆదర్శమంటూ ఓ కుర్రకుంక బయల్దేరడంలో అసలు సంగతేమిటని. వాడికేదో లోటుంది. ఏ జాడ్యమో, త్రాగుడో

మరిగివుంటాడు. తెలిసినవా రెవరూ పిల్లనిచ్చివుండరు. అందుచేత కట్నం లేకుండా చేసుకుంటానంటే పిల్లనిస్తా రేమోనని యిలా ప్లేటు ఫిరాయించేడు. రంగనాయకమ్మగారు తనకు కలిగిన అనుమానాన్ని పక్కింటి ఎదురింటి అమ్మలక్కలతో చెప్పడం వారు ఏక గ్రీవంగా తీర్మానంచేసి ఆ అనుమానాన్ని బలపరుస్తూ ఓటు వేయడం జరిగిపో యింది. ఇంకా దానికి తిరుగెక్కడ వారంరోజులు తిరిగేసరికి సుందరమ్మ ఉత్తరం వ్రాయించింది.

"మహారాజశ్రీ అన్నగారికి నమస్కార ములు.

మా అబ్బాయిదగ్గరనుండి ఉత్తరం వచ్చింది. తొందరలోనే ఏదో ముహూర్తం నిశ్చయించమని. మనం వెంటనే తొందరలో ఓ శుభముహూర్తం చూసి పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. ఈ ఏడాది మా వాడిపెళ్ళి ఏలాగయినా చెయ్యాలని నాకు పట్టుదలగా వుంది. ఓ కోడలొస్తే యింటివాడయితే నాకు కొంత భారం తగ్గుతుంది. మా అమ్మాయికి కూడా సంబంధాలు చూడాలికదా. అందువలన మీరు తిరుగుటపాలో జవాబు వ్రాయించండి, ముహూర్తంనిర్ణయించి.

—సుందరమ్మ"

సూర్యనారాయణగారు చిక్కులో పడ్డారు. ఏమని జవాబు వ్రాయడం. భార్యనే అడిగా రాయన. "ఆ ఏముందండీ పెద్ద బ్రహ్మాండం చేస్తున్నా రేమిటి. ఇష్టంలేదని వ్రాసేయండి చూస్తూ. చూస్తూ, ఏ త్రాగుబోతుకో, వ్యభిచారికో మన అమ్మాయిని కట్టబెడతామా." సుందరమ్మ తేల్చిపారేసింది విషయాన్ని.

"ఏం మాటలే అవి. అతడు త్రాగుబోతూ, వ్యభిచారీనా. కట్నం తీసుకోకుండా మన అమ్మాయిని చేసుకుంటానన్నంతమాత్రానికే అతడు వ్యసనపరుడెలా అయ్యాడే. స్త్రీబుద్ధి పోనిచ్చేవు కాదు. ఎదురింటి ఎల్లమ్మ, పక్కింటి పుల్లమ్మ చెప్పింది విని మంచి సంబంధం పాడుచేసుకోవడం ఏం బాగుంది చెప్పు." సూర్యనారాయణగారి బెంగల్లా మంచి సంబంధం, కట్నాలూ, కానుకలూ లేకుండా వచ్చినదీ తప్పిపోతుందేమో నని

"నా కేమీ చెప్పకండి బాబూ, అది మీ ఖాతురు. మీ యిష్టంవచ్చినట్లు చేయండి. నా అభిప్రాయాలకు ఇంకేం విలువుంది ఏదిసింది గనుక." రంగనాయకమ్మ గబాగబా వెళ్ళిపోయింది అక్కడనుండి.

సూర్యనారాయణగారి బుర్ర చీకాకెత్తిపోయింది. నిజంగా వేంకటాచలం అలాటివాడా ..అటనెంతో మంచివాడని తను నమ్మేడే. తన నమ్మకం వృధా పోరాదు. సరి తనకురాని ఈ పాడు అనుమానం వీళ్ళకెలా వచ్చింది చెప్మా.




సూర్యనారాయణగారు ఏదో నిశ్చయానికి వచ్చి రంగారావును పిల్చారు. "ఒరేయ్ రంగా నువ్వోసారి టాటానగర్ వెళ్ళి రారా." సూర్యనారాయణగారు అన్న దానికి రంగారావు ఆశ్చర్యపోయాడు.

"నేనా ఎందుకు!" ఆశ్చర్యంగా అడిగాడు తండ్రిని.

"ఏం లేదు మీ ఆమ్మా. నువ్వా పదేది వర్రీ అనుమానమేనని నా ఉద్దేశ్యం. ఆ కుర్రవాడు అలాంటివాడు కాడని నా మనసు చెప్తోంది. అతన్ని మన అమ్మాయికి చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరమని నా కనిపిస్తోంది. మన రామం ఉన్నాడుగా అక్కడ. వాడి దగ్గరికి తిన్నగా నువ్వు వెళ్ళినట్లయితే వాడి సహాయంతో అబ్బాయి గుణగణాలను తెలుసుకోవచ్చుకూడా." సూర్యనారాయణగారు చెప్పింది విని రంగారావు ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

"ఎందుకు నాన్నగారూ మనకీ బాధలన్నీ. మరొక సంబంధం వెతుకుతే పోతుందిగా" రంగారావు అన్నాడు.

"ఒరేయ్ మాట్లాడకుండా నేను చెప్పినట్లు చేసిరా" సూర్యనారాయణగారు విసుగ్గా అన్నారు. రంగ మౌనం వహించాడు.


* * *

"రండి, రండి..." ఆహ్వానించాడు చలం. రంగారావు తనతోవచ్చిన మరొక వ్యక్తినికూడా లోనికి తీసుకువచ్చాడు. "ఈయన నాకు వరుసకి అన్న ఔతారు. పేరు అనంతరామం. ఈయనకూడా స్టీలుఫాక్టరీలోనే పనిచేస్తున్నారు." రంగారావు పరిచయం ముగించాడు.

"నమస్తే" అదోలాగా అని చలం, రామంవంక చూస్తూ తనుకూడా కూర్చున్నాడు. "వీరిని చూడటానికే మీరు టాటా వచ్చారనుకుంటాను!" చలం నవ్వుతూ అడిగేడు. రంగారావు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. చలం రంగారావు నా విషయం అట్టే అడగలేదు. "అసలు విశేషం ఏమిటో, మీకు ఈ ఊర్లో బంధువులు ఉన్నట్లే నాకు తెలియదు. అదిగాక మీ రిలా హఠాత్తుగా రావడంలో ఏదో అంతర్యం ఉండాలి మరి" చలం అన్నాడు. "ఏంలేదు మీతో మాట్లాడాలనే ఆయనొచ్చాడు" రామం చలంవంక చూస్తూ చిరునవ్వుతో అన్నాడు. "ఏం మాట్లాడాలండీ" చలం రంగారావుకేసి తిరిగాడు. "మీరు క్షమించాలి. నేనిప్పుడు మీకు క్షమార్పణ చెప్పనా మనే వచ్చాను. మీ గురించి మా రామం చెప్పాడు. మేము అనవసరంగా మీ మీద అపోహపడ్డాం..." రంగారావు మధ్యలోనే చలం అందుకున్నాడు. "నేను గ్రహించానులెండి. ఇంక మీరు చెప్పనవసరంలేదు. నేను గుణవంతుడిని కాననికదా మీ అనుమానం. నేను కట్నం కోరనంతమాత్రానికే మీదృష్టిలో దుర్గుణవంతుడినయ్యాను. నిజంగా కట్నం తీసుకోవడం నాకిష్టంలేదు కనుక, ఒక ఆదర్శానికి కట్టుబడిఉండి, దాన్ని ఆచరించాలనే పట్టుదలతో ఉన్నాను గనుక, కట్నం తీసుకోనని ముందేచెప్పాను. నా ఆదర్శానికి విలువలేకుండా చేశారుమీరు. నేను పుణ్యానికిపోతే పాపం ఎదురయిందే. కట్నం కోరకపోవడంకూడా ఒక తప్పని నాకిప్పుడు అర్థమౌతోంది. ఏకంగా నా ప్రవర్తననే అనుమానించుతుంటే నేనేం చెప్పగలను. మీ చెల్లాయిని వేరేగా మీకు గుణవంతుడని తోచిన అబ్బాయి కెవరికైనా యిచ్చి చేయండి. మరోవిషయం. ప్రసంగం వచ్చిందిగనుక చెప్తున్నాను. నాకు వేరేసంబంధం కుదిరింది. అమ్మాయి నాకు మరదలు వరుస. అందుచేత మీకు నాగుణగణాలగురించి ఇకమీదట అవస్థపడ నవసరంలేదు." రంగారావుకి తల తిరిగినంత పనయింది. "మాటండి చలంగారూ ఏదో తొందరపాటు..." ఇంకేదో అనబోతూన్న రంగారావుని చలం వారించాడు. "క్షమించాలి మీరు – నేనింకేం వినదలచుకోలేదు. నామరదలిని చేసుకోవటం ఖాయం. మీ అమ్మాయికి మరో సంబంధం చూసుకోండి" చలం కోపంగా లోపలికి వెళ్ళిపోయాడు. రంగారావు చేసేది లేక రామంతో తిరుగుదారి పట్టేడు.

* * *

సూర్యనారాయణగారు రంగారావు తెచ్చినవార్తవిని చాలా విచారించారు. అన్ని యోగ్యతలూఉన్న అబ్బాయి అల్లుడు కావలసింది తప్పిపోయింది అదృష్టమని ఆయన బాధపడ్డారు. మూడు నాలుగు రోజులపాటు ఆయన తిండికూడా




సరిగా తినలేకపోయాడు. శారద ముఖంలో కూడా విచారఛాయలు చూసి రంగారావు బాధపడ్డాడు. ఒక్కగానొక్క చెల్లెలు పాపం! చలంమీద ఏవేవో ఆశలు పెంచుకుంది గాబోలు. కాని రంగారావు శారదని గమనించినంతవరకూ ఆమె కింకా ఏమూలో ఆశవున్నట్లు కనిపించింది అతనికి. శారదకింకా ఆశ ఎలా మిగిలింది చెప్మా. తను చెప్పింది విన్నాకూడా ఆమె యింకా ఆశలు వదలలేదూ అంటే అర్థంఏమిటి? చలం తనతో కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాడే రంగారావుకి ఏమీ అర్థంకాలేదు. రెండు రోజులు పోయిన తరువాత రంగనాయకమ్మగారు తనకు తెలిసిన ఓ సంబంధం సూచించారు. ఆమెకు దూరపుచుట్టరికం ఉన్న ఒక అబ్బాయి అతను. బి.యస్సీ పాసయ్యాడు

అని చెప్పిందావిడ. సూర్యనారాయణగారు భార్యమాటలు వినిపించుకోలేదు. తల్లి ఈ క్రొత్తసంబంధం గురించి ప్రస్తావించటం మొదలెట్టేసరికి శారద గదిలోకి వెళ్ళి తలుపువేసుకుంది. సూర్యనారాయణగారు కూతురివైఖరి గమనించకపోలేదు. [illegible] సంభాషణ ముగిశాక శారదను ఓదారుస్తూ అన్నాడు. "పిచ్చితల్లి ఎందుకమ్మా బాధపడతావు. అతను నిన్ను చేసుకోనన్నాడుట." శారద మెల్లిగా వెక్కుతూ తండ్రిగుండెలో తల దూర్చింది. సూర్యనారాయణగారు ఆప్యాయంగా శారదతల నిమురుతూ అడిగారు. "ఏమ్మా. అయితే నువ్వు చలాన్నితప్ప వేరెవరిని చేసుకోవా?" శారద సిగ్గుపడింది. తండ్రి గుండెల్లోనుండి తల తీయకుండానే అంది నెమ్మదిగా "మీరొక

సారి మాట్లాడండి నాన్నగారూ. కాదనరని నాకు నమ్మకంఉంది." సూర్యనారాయణ గారు "అలాగేనమ్మా" అంటూ వెళ్ళి పోయారు.

సూర్యనారాయణగారు మరో రెండు రోజుల్లో ముందుగా విశాఖవెళ్ళి సుంద రమ్మను కలుసుకొని, అంతగా అవసర మైతే టాటానగర్ వెళ్దామని నిర్ణ యించేరు. రేపు ఆయన బయలుదేరుతా రనగా ముందురోజున సుందరమ్మ వ్రాసిన ఒక ఉత్తరంవచ్చింది సూర్యనారాయణ గారికి

"అన్నగారికి నమస్కారములు, మీ సంబంధం చూసిన తరువాత, మా వాడికి మరో సంబంధం వచ్చింది మాకు చుట్టాలే అనుకోండి. మా అక్కయ్య అల్లుడికి పినతండ్రి కూతురు. ఆ అమ్మాయిని చేసుకుంటానని మా వాడు అంటున్నాడు. నేను వాడికి బోధపరచలేక ఊరుకున్నాను గాని వాడు కట్నమేమీ లేకుండా చేసు కుంటాననడం నాకారోజు నిజంగా నచ్చలేదు. ఆ ఆదర్శాలకు ఎంత విలువ లభించిందో వాడు నాకిపుడు వ్రాస్తున్నాడు. వాడిని నొప్పించడం నాకిష్టంలేదు. వాడి కిష్టమైన అమ్మాయినే చేయ సంకల్పిం చాను.

సుందరమ్మ"

ఈ ఉత్తరంచూసి సూర్యనారాయణగారు ప్రయాణం విరమించుకున్నారు. శారద భోజనం మానేసింది. రంగనాయకమ్మ కూతురిని గదమాయించి భోజనం వడ్డించినా ప్రయోజనం కనిపించలేదు. సూర్యనారాయణగారు చలం అల్లుడవుతా డన్న ఆశ వదులుకున్నారు.

* * *

సుందరమ్మ వ్రాసిన వుత్తరం వచ్చిన అయిదవనాడు, గుమ్మంముందు ఆగిన టాక్సీనుండి దిగుతున్న చలాన్ని, సుందరమ్మనూ, రామూన్నీ చూసిన రంగారావు తండ్రిగది లోకి ఒక్క గెంతు గెంతాడు చలం నేరుగా శారదను వెతు కుతూ ఆమె వున్న గదిలోకి వచ్చాడు. శారద మంచంమీద పడుకొని ఇంటి కప్పుకేసి చూస్తోంది. "శారదా" అనే పిలుపు వినిపించేసరికి లేచి మంచం దిగింది శారద. ఎదురుగా నవ్వుతున్న కళ్ళతో చలం. రెండుచేతులూ చాపి ఆహ్వానిస్తున్నాడు. శారద ఒక్క పరు గున పోయి అతని చేతుల్లో వాలిపోయి గుండెల్లో తల దూర్చింది. "పిచ్చిదానా, మా అమ్మ వ్రాసిన ఉత్తరంచూసి బాధ పడతావని నాకు తెలుసు, అయినా అది అమ్మ ఉద్దేశ్యపూర్వకంగా వ్రాసిన ఉత్తరంకాదు. రామం అలా వ్రాయిం చాడు. నాకు మరదలివరుస మరెవరో కాదు నువ్వే. కాకపోయినా నువ్వు నన్ను వశపరచుకున్నావ్ శారదా. మీ వాళ్ళు నన్నెంతగా అనుమానించినాసరే నిన్ను



తప్పు చేశానని గిల్టీగా ఫీలవుతున్నానుగా. నీ వుత్తరం...'' చలం నోటిని సున్నితంగా మూసింది శారద. "భయమెందుకు శారదా నీ అభిప్రాయం వ్యక్తీకరిస్తూ వ్రాశావు. అందులో తప్పేమిటి. అదికూడా తీసుకు వచ్చేను మీ వాళ్ళకి చూపడానికి. రామంగారి భార్య నాకు కజిన్ సిస్టర్ అవుతుంది. మీ కా సంగతి అంతగా తెలియదు. మీ అన్న టాటానగర్ వచ్చినపుడు రామాన్ని కలుసుకున్నాడు రామం అసలు బంధుత్వం దాచిపెట్టి నా గుణం మంచిదేనని చెప్పే వరకూ మీ అన్నకు నమ్మకం కలుగలేదు. మిమ్మల్ని ఒక ఆట ఆడిద్దామని నేనూ రామం కలిసి నాటకం ఆడేం. అంతే. ఆ నాటకంలో అమ్మకూడా చిన్న పాత్ర ధరించింది. అసలు మా సంబంధం సంగతి మీకు చెప్పిన రామం మనకుండే బంధుత్వాలేమీ చెప్పలేదు. నేనే వద్దన్నాను. బంధుత్వంతో గాకుండా ప్రేమతో నిన్ను గెల్చుకోవాలనుకున్నాను నిన్నింతలా బాధించినందుకు ఏ శిక్షయినాసరే భరిస్తాను శారదా'' చలం శారదను గుండెలకు అదుముకుంటూ అన్నాడు. శారద మెరిసేకళ్ళతో గాఢంగా చలాన్ని కౌగలించుకుంటూ గుండెల్లో తలదూర్చి నవ్వింది.

రామం చలం కలిసి ఆడిన నాటకం రంగారావుకీ, సూర్యనారాయణగారికీ, రంగనాయకమ్మకూ బోధపడింది.

చలం శారద తనకు వ్రాసిన ఉత్తరం చూపించాడు.

"చలంగారికి

నమస్కారములు. నేనిలా వ్రాస్తు

న్నందుకు ఏమీ అనుకోవద్దు. మీమీద అనుమానంకొద్దీ మావాళ్ళు వేరే సంబంధాలు చూడొచ్చు. నిన్న అమ్మ తన కొచ్చిన అనుమానాన్ని అన్నయ్యతో చెప్తుంటే నాకు ఆశ సన్నగిల్లుతోంది, మీతో నా వివాహం జరుగుతుందని. ఆ రోజు- పెళ్ళిచూపులనాడే, నా హృదయంలో మీ రూపం తిష్టవేసింది. మరచిపోలేకపోతున్నాను. మీరు ధైర్యంగా నన్ను వివాహ మాడటానికి సిద్ధపడితే, మా వాళ్ళు వేరే సంబంధం నిశ్చయించే పక్షంలో, నేనే బయలుదేరి మీ వద్దకు వస్తాను. నా కోరికని కాదనకండి. ఉత్తరం ఎవరికీ చూపవద్దు.

మీ జవాబుకోసం ఎదురుచూస్తూ
శారద."

రంగనాయకమ్మ తప్ప మిగతా వారంతా ఉత్తరం చూసి సంతోషించారు.

దానికి క్షమార్పణ చెప్తున్న ధోరణిలో సూర్యనారాయణగారు అన్నారు "నీ ఆదర్శాన్ని అర్థం చేసుకోలేకపోయామంటే అది మా అజ్ఞానమే అనుకోవాలి. కట్నాలు తీసుకునే దురాచారం ఎక్కువవుతోంది అని గోలపెడుతూనే, నేటి కళ్ళు లేని సంఘంలోని మనుష్యులు, కొందరే అనుకోండి, కట్నాలూ కానుకలూ లేకుండా వివాహానికి సిద్ధపడే యువకులను అనుమానిస్తున్నారు. అవమానిస్తున్నారు కూడా. కట్నాల దురాచారం తగ్గాలంటే యువకులు ముందంజ వేయడమొకటే కాదు మన దృక్పథాలూ, మన తత్వాలూ కొంతవరకు మారాలి మన సంతానం, జనమూ కలిసికట్టుగా దాన్ని నిర్మూలించడానికి పూనుకొన్నప్పుడే అది మాసిపోతుంది. ప్రస్తుతం చలంలాంటి ఆదర్శ యువకులు నూటికొకరేనా ఉన్నారని చెప్పలేమనుకోండి. కాని కొంతకాలం పోయిన తరువాతనైనా, ఇలాంటి యువకుల సంఖ్య మనమధ్య పెరగాలి. అప్పుడీ సాంఘిక దురాచారాలనేవి పోతాయి."

ఒక శుభముహూర్తం చూసి పెద్దలంతా శారదనీ, చలాన్నీ దాంపత్యబంధంతో ఏకంచేశారు.